# "తిరిగి ప్రకృతిలోకి"

అంకితం:
ఆకలితో అల్లాడే
ముష్టివారికి

కథకుడు :
పోలిశెట్టి వేంకట నాగేశ్వరరావు

★

ఈ పాడు ప్రపంచానికి భానుడు రాలేక రాలేక వస్తున్నాడు. కష్టాలు ప్రేమతో ప్రజల్ని కౌగిలించుకున్నాయి. మురికి కాలువగట్టు పైన పండుకొన్న ముష్టివాడు, చీకిపోయిన గోనెగుడ్డలను తొలగించుకొని, ప్రక్కనున్న కుండ పెంకులో దుమ్ము దులుపుకుంటూ తయారయ్యాడు లడుక్కోడానికి.

"కడుపు కన్నం లేదు బాబా......నాలుగు గింజలు వెయ్యి తల్లీ......నాకన్న తల్లులు"

"పో......అవతలకి"

"అయ్యో! తల్లీ! ఇంత పెద్దలో గిల్లలో వుంటున్నారు. రెండు గింజలు రాల్పకపోతే ఎలాబ్రతికేది చెప్పండి, బాబా"

"నీకేరా చెప్పేది, మనిషివా?...గొడ్డువా?" అని మేడలోపలి నుంచి కేక వినబడింది.

"అమ్మా! కడుపు కాలిపోతోంది తల్లీ. మూడు రోజుల్నుంచి ఆకలితో చచ్చిపోతున్నాను బాబా...." అని ప్రక్కింటికి పోయి అడిగాడు.

"పో......ప్రొద్దున్నే దిష్టి పిడతలాగ తయారయ్యావ్"

"అయ్యా! కొంచెం గెంజి బాబూ......నడవలేను తండ్రీ!"

"అరేయ్ గాడ్డీ——నీక్కాదురా చెప్పేది: పొమ్మంటుంటే పోవే! నీ బాబు సొమ్ము దాచిపెట్టినట్టు మాట్లాడ్తున్నావే."

"అయ్యో! ఎంత జాలిలేదు తండ్రీ" అని వెళ్లిపోతున్నాడు. ఒంటికాలు. కఱ్ఱలు బుజాలకు పెట్టుకొని నడుస్తున్నాడు. గడ్డంమీద, జుట్టుమీద దుమ్ము పడి దట్టంగా అట్టలు గట్టిపోయింది. పాపం! అతడు సుఖపడి పోతున్నాడని కాకోలు పేలు తలంతా కుట్టేస్తున్నాయి. అరుగుమీద కుండ పెంకు పెట్టి రెండు చేతులతో తలను బరుక్కుంటున్నాడు.

అప్పుడే ఆ మేడముందు కారు ఆగింది. లోపల్నుంచి ఒకాయన సిగరెట్టు కాల్చుకుంటూ కారెక్కబోతున్నాడు.

గాబరాతో కుంటు కుంటూ, ఎంతో ఆశతో కారు దగ్గరికి ముష్టివాడు వచ్చాడు.

"బాబూ! మీ కాళ్లమీద పడతా...కడుపు కాలి పోతూవుంది. ఒక్క డబ్బు యిప్పించండి... బాబా......ఒక్క డబ్బు" అని అడిగాడు అశ్రుధారతో. పోరా అవతలికి అని కార్లోకి పోయాడు. కారు కదిలింది. కాణీకోసం చూస్తున్న కండ్లలో దుమ్ము పడింది. కార్లోంచి పారేసిన సిగరెట్టు ముక్క వచ్చి దోసిట్లో పడింది. 'నిరాశ' అని అతని మనస్సు అరిచింది.

రోడ్డుప్రక్కనున్న మిఠాయి కొట్లోనుంచి పకోడీల వాసన కొడుతూవుంది.

"ఒక్క దమ్మిడీ యివ్వరు కదా బాబూ. ఆకలితో చచ్చిపొమ్మంటారా నాయనా. చచ్చిపోతే మాత్రం మీకేం లెండి. మీ బిడ్డను కాదు గదా. ఇటువంటి మిఠాయి వాసనలు కొడుతూవుంటే చూస్తూ గుటకలు మింగవలసిందేనా? బీదతనంలో పుట్టి పెరిగి గోనెగుడ్డల్లో మురిగి చావ వలసిందేనా? ఎంత చలివేస్తున్నా, ఎంత ఆకలి వేస్తున్నా, శరీరం ఎండలో ఎంత మాడిపోతున్నా సహించవలసిందేనా? మీ శరీరం లాంటిది కాదూ మా శరీరం మాత్రం ఈః ప్రపంచానికి ఎంత జాలి లేదు!" అంటూ మిఠాయి కొట్టు దగ్గరకు బోయి "నాకన్నతండ్రీ రెండు పకోడీలు పెడుదూ. నీకు ఎంతో పుణ్య ముంటుంది. ఎన్నాళ్లనుంచో తినాలని వుంది." అని గుటకలు మింగుతూ జాలిగా అడిగాడు.

"చీ......అవతలకు పో. ప్రొద్దుట్నుంచీ బోణీ కాక నే నేడుస్తుంటే నీకు పెట్టాలిరా"

"బాబు కదూ......కొంచెం పెడుదూ"

"మీ అందరికి యిలా పెట్టేస్తుంటే మేము బువ్వ తినక్కర్లేదు......మళ్లీరాకు......పో"

"మళ్ళీ ఎలాగ రాను నాయనా"

"రాలేకపోతే చావు ఏ నూతులోనో పడి... పో" అని కఱ్ఱతీసుకొచ్చి తన్నబోతున్నాడు.

"పోతాను బాబూ......పోతాను. ఎందుకు కొడ్తారు. ఉన్నదే ఒక్క కాలు. శరీరమంతా కుష్టు రోగంతో కుళ్లిపోతూవుంది కదా. ఇంకా నన్ను కొట్టినా ప్రాణాలు తీస్తావా? పోతానులే తండ్రీ."

కొంతదూరంలో ఒక కారు ఆగివుంది. అక్కడకు వెళ్లి నిల్చుని "బాబూ! ఒక్క డబ్బు యిప్పించరూ. ధర్మాత్ములు. మీ కొడుకూ కోడళ్లు సల్లగుండాలి నాయనా!" అని అరచాడు. దాంట్లో కుక్క తప్ప ఎవరూ లేరు. అతన్ని చూచి 'బొయ్యి......బొయ్యి' మని కుక్క మొరిగింది.

"ఓహో! నువ్వా! కుక్కవా! ఏనాడో పువ్వులపూజ చేశావ్. లేకపోతే కుక్కవై వుండి కార్లో కూర్చొని షికార్లు కొడ్తావా? ధనికుల వళ్లల్లో కూర్చుంటావా? రోజూ సబ్బునీళ్లలో స్నానం చేస్తావా? అడ్డమైన పదార్థాలు తినే కుక్కవు, అందరిచేతా 'ఛీ......ఛీ' అనిపించుకునే కుక్కవు నన్ను చూసి మొరుగుతావ్. సిగ్గులేని కుక్కా!... సిగ్గులేని కుక్కా!......సిగ్గులేని కుక్క!...ఎవరూ?......నేనే......నువ్వు కాదు. నేను. పొమ్మంటే పోకుండా సిగ్గులేకుండా దేవురించే కుక్కను, నేను. అడ్డమైన పదార్థాలను తినేది నేను పైకి మనిషిలాగ కన్పిస్తున్నాగాని నిజంగా నేను కుక్కను. జన్మల్లోకి నరజన్మ గొప్పదట, ఇదిగో బ్రతుకుతున్నాను చూడు. చూడు నావాలకం. మొరగడం మానేశావే? నన్ను చూస్తే నీకు సిగ్గువేసిందా? లేకపోతే అధముడితో పోట్లాటం ఎందు కనుకున్నావా? అవును నీ దర్జాకు లోటొస్తుంది. నువ్వు నాకంటే వందరెట్లు ఎక్కువ. వెయ్యి కాదు లక్షరెట్లు ఎక్కువ. లేకపోతే నా బ్రతుకెట్టుకొని నీలాగ ఎన్ని జన్మలకైనా కార్లో కూర్చోగలనా? సెబాష్......ఓ కుక్కా...బ్రతుకంటే నీది. కుక్క జన్మయితే ఏం? రాజభోగాలు అనుభవిస్తున్నావ్." అంటూ వెళ్లిపోయాడు.

ప్రొద్దెక్కి పోతూవుంది. అతనికి ఆకలెక్కువై పోతూవుంది. శరీరమంతా చెమటలు పోసినయ్. కాళ్లు తేలి పోతున్నాయి.

"ఏంజెయ్యను? దేవుడా చంపనన్నా చంపవేమిరా? ఇలాగ ఎన్నాళ్లు మూడను. ఎంతదూరం నడిచినా పిడికెడు మెతుకులు వేసే దాత లేడు కదా! కడుపునిండా కూడు దొరకమూ...నా గతి యింతేనా? మీ సంతోషాలు మీవే. మీ సుఖాలు మీవే. అంతేగాని మా ముఖాలైనా చూడరు. కాళ్లూచేతులూ వుండి కార్లలో ఊరేగుతున్నారు. మా వంటి కాళ్లులేనోళ్లు కటికి కంకర రాళ్లమీద దేకి పోవలసి వచ్చింది. పిల్లులకీ, కుక్కలకైనా వేస్తారు ఎంగిలి కూడు. అంతకంటే అధములమా? చెయ్యి జాపి అన్నమో తల్లీ అంటే నాల్గు మెతుకులు రాల్చరూ... ఎంత పాపం! అబ్బో......ఆకలి......ఆకలి" అని ఏడుస్తూ క్రింద పడిపోయాడు.

ధనికులందరూ మేడలమీద వుండి వాడి మాటలు వినిపించుకో లేదు.

కొంత దూరంలో విస్తరాకుల్లోని ఎంగిలికూటిని కుక్కల్ని తరిమి కాకులు, కాకుల్ని తరిమి కుక్కలు తింటున్నాయి. అక్కడకు గబగబా పోయి విస్తళ్ల మధ్య పడి ఆకుల్లోని అన్నాన్ని ఒక ఆకులోకి పోగు చేసి, ఎడమచేతితో కుక్కలను తరుముతూ, తింటానికి కూర్చున్నాడు. ఆ దారినే పోతున్న కారు కూటిలో దుమ్మెత్తి పోసింది. ఆ కూటినే ఆత్రంతో, ఎటూ చూడకుండా తింటున్నాడు.

వెనకనుంచి ఒక కుక్క వచ్చి వీపుమీద కఱచి ఒక కండను లాగింది. ఆ కండను తీసుకోడానికి ఒక కాకి గాయం మీద ముక్కుతో పొడిచి ఎగిరి పోయింది. గాయానికి గోనెగుడ్డ చుట్టి, పోయి చూరు క్రింద పడుకున్నాడు. భూమంతా రక్తంతో తడిచి పోయింది. సొమ్మసిల్లి నిద్రబోతున్నాడు.

ఆ మేడ లోపలినుంచి ఒక యిమిటేషన్ దొర వచ్చి "ఎవడురా అక్కడ? ఎక్కడ బడితే అక్కడే ప్రత్యక్షం వెధవలుపాకీ వెత్తలాగ" అన్నాడు.

వేసవికాలం వేడిగాల్పులు వీస్తున్నాయి. ధనికులందరూ మేడల్లో హాయిగా నిద్రబోతున్నారు.

అతన్ని చూచి ప్రకృతి మాత జాలిపడింది. నవ్వు నవ్వింది. 'నిన్ను పెంచటానికి మానవ లోకానికి బరువైతే నాకు బరువా? రా......బిడ్డా......నా కౌగిట్లోకి...రా......నీకే ఆకలీ ఉండదూ. నీకే బాధా వుండదు. అని అతనికోసం చెయ్యి జాపి ఆహ్వానించింది.

అతనికి గాలిదెబ్బ తగిలింది. "దాహం......మంచినీళ్లు......బాబూ! మంచినీళ్లు...దా...హం" అంటూ క్రిందకు ఒరిగిపోయాడు. ప్రాణం ప్రకృతిలో లీనమైపోయింది. కూడు పెట్ట లేకపోయినా చచ్చిన శరీరాన్ని మాత్రం చాపకు చుట్టి మట్టిలో కలిపేశారు. మానవలోకం మాత్రం నిర్దయతో చూసి వూరుకుంది.